నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 12 ఆగస్టు 2024 | YADADRI BHUVANAGIRI

మేళ్లచెర్వులోని రేవూరు రోడ్డులో వేసిన చెత్త

పారిశుధ్యం.. అస్తవ్యస్తం

- పంచాయతీలకు నిధుల్లేక ఆగమాగం!
- రోడ్లపై మురుగు, ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం
- ఎనిమిది నెలలుగా నయాపైసా విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం
- ప్రత్యేకాధికారుల పాలనలో పట్టించుకునే వారే కరువు
- నిధుల్లేక తూతూమంత్రంగా సాగిన స్వచ్ఛదనం..పచ్చదనం

గ్రామాల్లో పడకేసిన పాలన

సూర్యాపేట, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ) : పల్లెల్లో పారిశుధ్యం లోపించి అస్తవ్యస్తంగా మారాయి. వీధుల్లో చిన్న గుంత ఏర్పడినా పూడ్చేవారే కరువయ్యారు. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతున్నది. ఈగలు, దోమల బెడద పెరిగి వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఎనిమిది నెలల్లోనే గ్రామాలు అధ్వాన్నంగా అవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లె, పట్టణ ప్రగతి పేరిట ప్రతి నెలా జిల్లాకు రూ.12 కోట్ల నుంచి రూ.16 కోట్లు ఇచ్చి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టింది. గ్రామాలకు కేంద్రం నిధులు ఇచ్చినా ఇవ్వకపోయినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆపలేదు. దాంతో రాష్ట్రంలోని పల్లెలు కొత్త రూపు సంతరించుకున్నాయి. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో పల్లెలు దారుణంగా మారాయి. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటినా ఇటు రాష్ట్రం నుంచి అటు కేంద్రం నుంచి పంచాయతీల కు నిధులు రావడం లేదు. ఇటీవల కాంగ్రెస్ సర్కారు ఎంతో ఆర్భాటంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించినప్పటికీ నయాపైసా ఇవ్వకపోవడంతో తూతూ మంత్రంగా జరిగిపోయింది. ప్రస్తుతం ఏ గ్రామానికి వెళ్లినా మురికి గుంతలు, చెత్తా చెదారంతో నిండిన వీధులు, పెరుగుతున్న పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి.

చిల్లి గవ్వ లేదు

పల్లెలే ప్రగతికి సోపానాలని నమ్మిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన తొమ్మిదిన్నరేండ్ల పాలనలో వ్యవసాయం మొదలు అనుబంధ వృత్తులకు ఊతం ఇచ్చేలా వేల కోట్ల రూపాయలు వెచ్చించారు. గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారు. ఒక్క సూర్యాపేట జిల్లాకే ప్రతి నెలా రూ.12 కోట్ల నుంచి రూ.16 కోట్లు వచ్చేవి. దాంతో అంతర్గత రోడ్ల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ, తదితర పనులకు వెచ్చించేవారు. కొనుగోలు చేసిన పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింటికీ చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేవారు. సెగ్రిగేషన్ షెడ్లలో తడిచెత్తతో ఎరువు తయారీ చేసేవారు. కానీ ..నేడు ఇలాంటివి ఎక్కడా కనిపించడం లేదు. సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరిలో పూర్తి కాగా అప్పటి నుంచి కేంద్రం నుంచి నయాపైసా రాలేదు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వానికి నిధులు ఇవ్వాలనే సోయి కూడా కనిపించడం లేదు. ఫిబ్రవరికి ముందు ఒక నెలకు సంబంధించిన కేంద్రం నిధులు పెండింగ్ ఉండగా అవి త్వరలో వస్తాయని అధికారులు అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కార్మికుల వేతనాల కోసం కొద్దిపాటి నిధులను ఈ నెలలో ఇచ్చినట్లు సమాచారం. అంతే తప్ప గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం నిధులు మాత్రం ఇవ్వడం లేదు.

వలిగొండలో జనావాసాలకు సమీపంలో రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్త

పంచాయతీ కార్యదర్శులపై భారం

సర్పంచుల పదవీ కాలం పూర్తయిన తర్వాత పల్లెల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై పడింది. గ్రామాల్లో తరుచూ తాగునీటి బోర్లు కాలిపోవడం, పైపులైన్ల మరమ్మతులు, గేట్‌వాల్ మార్చడం, పారిశుధ్య పనులు, వాటర్ ప్లాంట్ల మరమ్మతులు ఇలా అనేక పనులు చేయాల్సి వస్తున్నది. ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించి చేతులు దులుపుకుంది తప్ప పంచాయతీలకు నిధులు మాత్రం ఇవ్వడం లేదు. దీంతో సమస్యలపై ప్రజల నుంచి ఒత్తిడి పెరుగడం, కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్తుండడంతో చేసేదేమీ లేక పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి పనులు చేయాల్సి వస్తున్నది. ఇలా జిల్లాలోని ఆయా పంచాయతీల్లో సెక్రటరీలు చేసిన అప్పులు ఒక్కొక్కరివి రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం ఇటీవల ఉద్యోగుల బదిలీలకు జీఓ తీసుకురావడంతో ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న పంచాయతీ సెక్రటరీలు కూడా తమ అర్హతను బట్టి ఎక్కడి వెళ్లాలో వెతుక్కునే పనిలో పడ్డారు. మరోపక్క బదిలీ అయితే తాము ఖర్చులు చేసిన బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు సెక్రటరీలు మదనపడుతున్నారు. ఈ విషయమై సూర్యాపేట జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌కుమార్‌ను వివరణ కోరగా సెక్రటరీలు డబ్బులు వెచ్చించి పనులు చేసింది వాస్తవమేనని, చేసిన పనులకు సంబంధించి బిల్లులు చేసి సబ్‌మిట్ చేస్తే సరిపోతుందని తెలిపారు.

ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉన్నది

గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త చెదారం కనిపిస్తున్నది. డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోయి కంపుకొడుతున్నాయి. మురుగు నీరు రోడ్లపైనే పారుతున్నది. దోమలు ఎక్కువై మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వస్తున్నాయి. పంచాయతీ అధికారులు పట్టించుకోపోవడంతోనే ఈ సమస్య వస్తున్నది. వర్షాకాలం కావడంతో చెత్తతో ప్రజలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దీనిపై దృష్టి పెట్టాలి.

– నానచర్ల రమేశ్, ఆటో కార్మికుడు, వలిగొండ

పట్టించుకునే వాళ్లే లేరు

మూడు నాలుగు రోజులకు ఒకసారి మంచినీళ్లు వస్తున్నాయి. పట్టించుకునే వాళ్లే లేరు. పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రమే. గత సర్పంచ్ ఉన్నప్పుడు పాలన బాగానే ఉండేది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్మికులకు కూడా జీతాలు ఇవ్వడం లేదు. గ్రామ పనుల అవసరాల నిమిత్తం ట్రాక్టర్ వాడేందుకు డీజిల్ సైతం లేదు. గ్రామ పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సక్రమంగా ఇవ్వకపోవడం సరైంది కాదు.

– తగరం వెంకటేశ్, ఖైతాపురం, చౌటుప్పల్

అడవిదేవులపల్లి : లిఫ్ట్ పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమెల్యే బీఎల్‌ఆర్, కలెక్టర్ నారాయణరెడ్డి

రైతుల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యం

- వచ్చే ఆగస్టు 15న నాటికి ఐదు లిఫ్టులను ప్రారంభిస్తాం
- లిఫ్ట్ పనుల పరిశీలనలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 11: రైతుల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలోని చిట్యాల గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న దున్నపోతుల గండి లిఫ్ట్ పనులను శనివారం నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌పాటి, ఎన్ఎస్పీ చీఫ్ ఇంజినీర్ అనిల్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి పరిశీలించారు. పనుల తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలోని దున్నపోతుల గండి, బొత్తలపాలెం- వాడపల్లి, తోపుచర్ల, వీర్లపాలెం లిఫ్టు ఇరిగేషన్ పనులు కొనసాగుతున్నాయని, దున్నపోతులగండి పథకానికి రూ.219.19కోట్లు, బొత్తలపాలెం పథకానికి రూ.259.25కోట్లు, వీర్లపాలెం-2 ఎత్తిపోతల పథకానికి రూ.32.22కోట్లు, తోపుచర్ల ఎత్తిపోతల పథకానికి రూ.9.30కోట్లు, దామరచర్ల మండలం కేశవాపురం ఎత్తిపోతల పథకానికి రూ.75.93కోట్లను మొత్తం రూ.490 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. పనులను సంవత్సరకాలంలోపు పూర్తి చేయాలని చెప్పారు. దీనికి అవసరమైన నిధులు, పరికరాలను, భూసేకరణ పూర్తయ్యేలా సహకారం అందిస్తామన్నారు. వచ్చే ఆగస్టు 15న నాటికి ఈ ఐదు లిఫ్టులను ప్రారంభిస్తామన్నారు. దీనికి అవసరమైన చర్యలన్ని అధికారులు చేపట్టాలని, భూసేరకరణలో రైతులకు అన్యాయం జరుగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో మూడు చెక్ డ్యాంలను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

మూడున్నర లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తాం

డిండి : డిండి ఎత్తిపోతల పథకం ద్వారా దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో మూడున్నర లక్షల ఎకరాలకు సారునీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. డిండి మండల కేంద్రంలో ఆదివారం పలు ప్రాజెక్టులపై ఆయన మునుగోడు, దేవరకొండ ఎమ్మెల్యేలు రాజగోపాల్ రెడ్డి, బాలూనాయక్‌తో కలిసి నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏటా 6లక్షల ఎకరాల చొప్పున ఐదేండ్లలో 30లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదన్నారు. డిండి ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాలోని అత్యంత వెనుకబడిన, ఫ్లోరైడ్ ప్రాంతమైన మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో సుమారు మూడున్నర లక్షల ఎకరాలకు సాగు నీరందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.460 కోట్లు రివైజ్డ్ ఎస్టిమేషన్ వేసి క్యాబినెట్ ముందుకు ఉంచామన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో మంజూరైన అంబాభవాని, కంబాలపల్లి లిఫ్ట్ పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో నీటిపారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఇంజినీరింగ్ చీఫ్ అనిల్‌కుమార్, కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్, ఈఈ నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌రావు, సీఈ నాగేశ్వర్‌రావు, ఎస్ఈ వెంకటేశ్వర్‌రావు, డీఈలు ప్రభాకర్, మనోహర్, శ్రీనివాస్, కృష్ణయ్య, ఆర్డీఓలు శ్రీనివాస్‌రావు, శ్రీరాములు, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు యాదన్నకుమార్, సత్యనారాయణ, యలమంద, రాములు, ఆనందరావు, స్కైలాబ్‌నాయక్, పొదిల శ్రీనివాస్, తమ్మడబోయిన అర్జున్, గాయం ఉపేందర్‌రెడ్డి, ఎన్ఎస్పీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరద కాల్వకు పడిన గండిని పూడ్చి నీటిని విడుదల చేసిన అధికారులు

వరద కాల్వ గండి పూడ్చివేత

హాలియా, ఆగస్టు 11 : అనుముల మండలం మారేపల్లి-పులిమామిడి గ్రామాల మధ్య ఏఎమ్మార్పీ లో లెవల్ కెనాల్ వరద కాల్వకు పడిన గండిని అధికారులు పూడ్చివేశారు. అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు ఆదివారం వరద కాల్వకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ నెల 6న మారేపల్లి-పులిమామిడి గ్రామాల మధ్య వరద కాల్వకు 40మీటర్ల మేర గండిపడటంతో వరద కాల్వకు నీటి విడుదల నిలిపివేశారు. గండిపడిన ప్రాంతాన్ని ఇటీవల మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ సందర్శించి గండిని త్వరగా పూడ్చివేయాలని అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు.

ఐదు రోజుల్లో పని పూర్తి చేసి నీటిని విడుదల చేశారు. వరద కాల్వ కింద నాగార్జున సాగర్, మిర్యాలగూడ, నల్లగొండ నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో 80 వేల ఎకరాల భూమి సాగవుతున్నది. 30 చెరువులకు మేలు కలుగుతుంది.

బోనాలెత్తుకొని ఊర ముత్యాలమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

బోనమెత్తిన సూర్యాపేట

బొడ్రాయిబజార్, ఆగస్టు 11 : సూర్యాపేట జిల్లా కేంద్రంతోపాటు పరిసర ప్రాంతాల్లో ఆదివారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఊర ముత్యాలమ్మ, కోట మైసమ్మ, బేచిరాగ్ మాదారం ముత్యాలమ్మకు మహిళలు బోనాలు సమర్పించారు. చీరెలు, సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, యువకుల చిందులతో పట్టణం కోలాహలంగా మారింది.

సూర్యాపేటలో బోనమెత్తుకొని వస్తున్న మహిళ

వరద తగ్గినా.. తగ్గని జనం

- సాగర్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులు
- 8 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

8 క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల, తిలకిస్తున్న పర్యాటకులు

నందికొండ, ఆగస్టు 11 : శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో నాగార్జునసాగర్ డ్యామ్ క్రస్ట్ గేట్లను 26 నుంచి 8 క్రస్ట్ గేట్లకు తగ్గించి నీటి విడుదల చేస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో డ్యామ్ అందాలను చూసేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే వాహనాలు డ్యామ్‌కు వద్దకు బారులుదీరాయి. దాంతో ట్రాఫిక్‌కు ఆటంకంగా మారింది. వరద తగ్గుముఖం పట్టడంతో గేట్లు తగ్గించినా జనం రద్దీ మాత్రం తగ్గలేదు. పర్యాటకులు డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా జాలువారుతున్న కృష్ణమ్మ అందాలను వీక్షిస్తూ సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు. వరద ఉధృతి నేపథ్యంలో ఆదివారం కూడా లాంచీలను నాగార్జునకొండకు, జాలీ ట్రిప్పులను నడపలేదు. సాగర్‌కు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నా కనీస సౌకర్యాలను అధికారులు చేపట్టడం లేదు. మంచి నీరు ఎక్కడా అందుబాటులో లేదు. మల విసర్జనకు టాయిలెట్స్ లేవు. కొందరు మంచి నీరు దొరుకక రాతిపొరల నుంచి వస్తున్న డ్యామ్ లీకేజీ వాటర్‌ను పట్టుకొని తాగారు.

1.20 లక్షల ఇన్‌ఫ్లో

శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ డ్యామ్‌కు శనివారం 3 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగగా, ఆదివారం నాటికి 1,20,528 క్యూసెక్కులకు తగ్గింది. దాంతో డ్యామ్ క్రస్ట్ గేట్లను 26 నుంచి 8 గేట్లకు తగ్గించారు. 63,120 క్యూసెక్కుల నీటిని గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. కృష్ణా పరీవాహక ప్రాజెక్టుల లోకి ఇన్‌ఫ్లో తగ్గిపోవడంతో ఆల్మట్టికి 50,000, నారాయణపూర్‌కు 25,000, జూరాలకు 90,000, తుంగభద్రకు 36,739, శ్రీశైలానికి 2,25,744 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. తుంగభద్రకు ఇన్‌ఫ్లో తగ్గినా డ్యామ్ 19వ గేట్ ఊడిపోవడంతో 55,327 క్యూసెక్కుల అవుట్ ఫ్లో వస్తున్నది. ఎగువన ఇన్‌ఫ్లో లేకున్నా తుంగభద్ర గేట్ ఊడిపోయినందున మరో 20 టీఎంసీల వరకు నీరు శ్రీశైలం మీదుగా నాగార్జునసాగర్‌కు చేరనున్నది. నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకుగానూ ప్రస్తుతం 588.00 (306.1010 టీఎంసీలు) అడుగులు ఉన్నది. క్రస్ట్ గేట్లతోపాటు ఎడమ కాల్వ ద్వారా 8,454, కుడి కాల్వ ద్వారా 741, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,557, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. సాగర్ రిజర్వాయర్ నుంచి మొత్తం 1,03,972 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉన్నది.

సాగర్ డ్యామ్ వద్ద సినీ నటి లయ

రెండు గేట్ల ద్వారా పులిచింతల నీటి విడుదల

చింతలపాలెం : ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో పులిచింతల ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 175.00 (45.77 టీఎంసీలు) అడుగులకు గానూ ఆదివారం రాత్రి 8 గంటల వరకు 167.026(34.284టీఎంసీలు) అడుగులు ఉన్నది. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టుకు 72,958 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుండగా, ప్రాజెక్టు రెండు గేట్ల నుంచి 32,638, జెన్‌కో గేట్ల ద్వారా 16,000, మొత్తం 48,638 క్యూసెక్కుల అవుట్ ఫ్లో విడుదల చేస్తున్నారు. తెలంగాణ జెన్‌లో 16000 క్యూసెక్కుల నీటితో 4 యూనిట్లను రన్ చేస్తూ 70 మెగా వాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నట్లు జెన్‌కో ఎస్ఈ దేశ్యా నాయక్ తెలిపారు.

జాలువారుతున్న సాగర్ నీటిని బాటిళ్లలో పట్టుకుంటున్న పర్యాటకులు

సాగార్జునసాగర్ డ్యామ్ పరిసరాల్లో పర్యాటకులు

యాదగిరికొండపైన విష్ణు పుష్కరిణిలో స్నాన సంకల్పాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఆలయ ప్రధానార్చకుడు లక్ష్మీ నరసింహాచార్యులు

యాదగిరిగుట్టలో స్నాన సంకల్పానికి శ్రీకారం

యాదగిరిగుట్ట, ఆగస్టు 11 : శ్రావణ మాసంతో పాటు లక్ష్మీనరసింహ స్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకొని యాదగిరిగుట్ట దేవస్థానంలో ఆదివారం స్నాన సంకల్పానికి శ్రీకారం చుట్టారు. అఖండ దీపారాధనకు జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కొండపైన విష్ణుపుష్కరిణిలో భక్తులతో కలిసి స్నానమాచరించారు. అర్చకులచే సంకల్పం గావించారు. అనంతరం మాఢ వీధి ఈశాన్య ప్రాంతంలో అఖండ దీపారాధనను ప్రారంభించారు. ఇక నుంచి ప్రతి రోజూ దీపారాధన ఉంటుందని, భక్తులు పాల్గొని ఆ పక్కనే కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకునే అవకాశం ఉంటుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. ప్రతి నిత్యం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొండపైన విష్ణు పుష్కరిణిలో స్నాన సంకల్పం ఉంటుందని, భక్తుల పాల్గొని మొక్కులు తీర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ భాస్కర్‌రావు, ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌ధీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఏఈఓలు జూశెట్టి కృష్ణ, రఘు, డీఈఈ దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

14 నుంచి పవిత్రోత్సవాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంతోపాటు అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలకు ఈ నెల 14న శ్రీకారం చుట్టనున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ప్రధానాలయంలోని వెలుపలి ప్రాకారం అద్దాల మండపంలో శ్రావణ శుద్ధ దశమి బుధవారం అంకురార్పణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, ఇవి 15, 16 వరకు జరుగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా రెండు రోజుల్లో ఆర్జిత పూజలైన నిత్య, శాశ్వత తిరుకల్యాణం, బ్రహ్మోత్సవం, శ్రీసుదర్శన నారసింహ హోమం రద్దు చేయనున్నట్లు తెలిపారు. 17న యథావిధిగా స్వామివారి నిత్య కైంకర్యాలు నిర్వహిస్తామని అన్నారు.

సాగర్ నీటితో చెరువును నింపి ఆదుకోవాలి

- సోమోని చెరువు వద్ద రైతుల నిరసన

నీళ్లు లేక ఎండిన సోమోని చెరువు వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

త్రిపురారం, ఆగస్టు 11 : మండలంలోని అంజనపల్లి, రాగడప, గుడితండా, వస్రాంతండా, మాటూరు, పాల్తితండా గ్రామాల్లోని 2వేల ఎకరాలకు నీరందించే సోమోని చెరువును సాగర్ నీటితో నింపి ఆదుకోవాలని రైతులు కోరారు. ఆదివారం పలువురు రైతులు పూర్తిగా ఎండిన చెరువు వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. చెరువులో నీళ్లు లేక బోర్లు, బావులు ఎండిపోయాయని, వ్యవసాయానికి ఇబ్బందిగా మారిందని తెలిపారు. చెరువు విస్తీర్ణం 40 ఎకరాలు ఉంటే 20 ఎకరాలు కబ్జాకు గురైందని, కనీసం ఉన్న చెరువులోనైనా నీరు నింపితే పది గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులకు ఎంతో ఉపయోగ పడుతుందని చెప్పారు.

కాల్వలు కూడా కబ్జాకు గురయ్యాయని, ఎన్ఎస్పీ అధికారులు స్పందించి చెరువుకు నీటిని విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు ధనావత్ వెంకట్రామ్‌నాయక్, ధనావత్ సుక్యనాయక్, ధనావత్ బాషానాయక్, ధనావత్ బోజనాయక్, బోడియానాయక్, మంగునాయక్, లక్ష్మా, వసం సైదులు, మూతీరాంనాయక్, రమావత్ సైదానాయక్, జగపతినాయక్ పాల్గొన్నారు